క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై చర్చావేదిక



డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ : విజయవాడలో 125 అడుగుల ఎత్తు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్, డీన్ స్కూల్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో సోమవారం విద్యార్థులకు డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాంపిటీషన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అధ్యాపకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ప్రొఫెసర్ జె.కాత్యాయని, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం.విద్యావతి, డాక్టర్ టి.శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధవి విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఆర్టీసీ స్లీపర్ కోచ్

తిరుపతి అర్బన్: వెంకటగిరి నుంచి హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు ప్రత్యేక సర్వీస్‌ను మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తిరుపతి డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాన్ ఏసీ స్లీపర్ స్టార్‌లైనర్ సర్వీస్‌ను ప్రతిరోజు రాత్రి 7.30 గంటలకు వెంకటగిరి నుంచి బయలుదేరుతుందన్నారు. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు చేరుకుంటుందని చెప్పారు. అదేరోజు రాత్రి 6 గంటలకు తిరిగి హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు వెంకటగిరికి చేరుకుంటుందన్నారు. ఈ స్లీపర్ సర్వీస్ వెంకటగిరి నుంచి గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుందన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'నా భర్త ఆచూకీ తెలపండి'



రాజేష్‌కుమార్ భార్య మంజుల

తిరుపతి కల్చరల్: ఒక దొంగతనం కేసు విషయమై విచారణ పేరుతో గత నెల 30వ తేదీన రాత్రి 10 గంటలకు ఏర్పేడు పోలీసులు తన భర్త రాజేష్‌కుమార్‌ను తీసుకెళ్లారని, అప్పటి నుంచి తన భర్త ఏమయ్యారో తెలియలేదని బాధితురాలు మంజుల వాపోయింది. ఈ మేరకు సోమవారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేణిగుంటలోని గణేష్‌నగర్‌లో తాము నివాసం ఉంటున్నామని, తన భర్త రాజేష్ చేపల వ్యాపారం చేసి తమను పోషిస్తున్నారని తెలిపింది. అయితే పాపానాయుడుపేటలోని ఓ నగల దుకాణంలో జరిగిన చోరీలో తన భర్త ప్రమేయం ఉందని, విచారణ చేసి పంపుతామని పోలీసులు తీసుకెళ్లారని చెప్పింది. కానీ ఇంతవరకు తన భర్త ఎక్కడున్నాడో తెలియలేదని, కనీసం పోలీసులు చెప్పడం లేదని ఆమె వాపోయింది. తన భర్తను పోలీసులు తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయని, అవి తమ వద్ద ఉన్నాయని చెప్పింది. నగల దుకాణంలో దొంగతనం చేసిన వారిలో విశ్వ అని రేణిగుంటకు చెందిన ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకున్నట్లు పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయని ఆమె గుర్తు చేసింది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తన భర్త ఆచూకీ తెలియజేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపేడు ఈశ్వరయ్య కాలనీ సుగాలీలు

తిరుపతి అర్బన్: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి ని స్వాధీనం చేసుకోవాలని శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు ఈశ్వరయ్య కాలనీకి చెందిన సుగాలీలు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్పందనలో అర్జీలు అందించిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. తమ గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలమైన తమకు కేటాయించిన భూములను సైతం ఆక్రమించి ఆన్‌లైన్‌లో తమ బినామీ పేర్లతో మార్పు చేసుకున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని స్థానిక పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వీసీ శ్రీకాంత్‌రెడ్డికి అభినందన



వీసీ శ్రీకాంత్‌రెడ్డిని అభినందిస్తున్న చక్రవర్తిరెడ్డి

తిరుపతి కల్చరల్: ఇటీవల ఎస్వీ యూనివర్సిటీ ఉపకులపతిగా నియమితులైన ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డిని సోమవారం ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డీవీఏ చక్రవర్తిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీని శాలువ, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు యూనివర్సిటీ అభివృద్ధిపై చర్చించారు.

దేశ చరిత్రలో ఇదే ప్రథమం

- 5,221 మందికి పట్టాలు పంపిణీ చేయడం గర్వంగా ఉంది
- జీవితాంతం మేము సీఎం జగన్‌కు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి రుణపడి ఉంటాం
- తాజాగా రెండోవిడతలో 1,703 మందికి ఇంటి పట్టాల పంపిణీ సందర్భంగా ఉద్యోగుల హర్షం
- టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూమనకు ఘన సన్మానం



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని సన్మానిస్తున్న టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): తిరుమల తిరుపతి దేవస్థానంలో పని చేస్తున్న 5,221 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వడం భారతదేశంలోనే ఎక్కడా జరగలేదని, ఇది ఒక చరిత్ర అని టీటీడీ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. సోమవారం మహతి ఆడిటోరియంలో టీటీడీ ఉద్యోగులకు రెండో విడత ఇంటి పట్టాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఉద్యోగులు మాట్లాడుతూ తమ పాతికేళ్ల ఇంటి స్థలాల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని జీవితంలో మరువమన్నారు. టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు, టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు భూమన కరుణాకర రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం చీర్ల కిరణ్ మాట్లాడుతూ అహర్నిశలు శ్రమించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఒప్పించి మెప్పించి టీటీడీ ఉద్యోగుల కలను సాకారం చేసిన టీటీడీ చైర్మన్ భూమనకు తాము జీవితాంతం కృతజ్ఞులుగా ఉంటామన్నారు. గత వారం మొదటి విడతలో 3,518 మందికి, నేడు మళ్లీ మహతి ఆడిటోరియంలో రెండోవిడతలో 1,703 మందికి టీటీడీ చేతుల మీదుగా ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేయడంతో ఉద్యోగులకు సంక్రాంతి పండుగ 10 రోజుల ముందే వచ్చినట్లుందన్నారు.

అతిత్వరలో మూడో విడత..

మూడో విడత అతి త్వరలో ఉంటుందని, వెంకటగిరి రోడ్డులోని ఐఐటీ వద్ద దాదాపు 350 ఎకరాలలో ప్రస్తుతం మిగిలి ఉన్న ఉద్యోగులకు, రిటైర్డ్, మరణించిన ఉద్యోగులకు దాదాపు 4000 మందికి ఇంటి స్థలాలు ఇవ్వబోతున్నారని తెలిపారు. అందుకు గానూ టీటీడీ పాలకమండలి రూ.87.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ మహాయజ్ఞాన్ని ముందుండి నడిపిస్తున్న చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి, సహకరించిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏవీ ధర్మారెడ్డికి, తితిదే ఉన్నతాధికారులకు, అధికారులకు టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, టీటీడీ ఉద్యోగులందరి తరపున కృతజ్ఞతలు అన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రంగా నాయక్, హేమలత, ఇ.సునీల్ కుమార్, శ్రీహరి, రేఖ, కొప్పర్తి శివ, అశోక్ కుమార్, విశ్వనాథం, శ్రీనివాసరావు, పెరుమాళ్, చిన్ని, కేశవులు, వంకీపురం పవన్, మణికంఠ, గంట భరత్, ధరణి కుమార్, పూల హరికృష్ణ, రూప్ సాగర్, అంకయ్య, జిల్లా శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూమనకు రుణపడి ఉంటాం



నల్లానిబాబును శాలువతో సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : గత ఏ ప్రభుత్వాల్లో దక్కని గౌరవం, ఉన్నతస్థానం వైఎస్సార్‌సీపీలో ఎస్సీలకు దక్కిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు అన్నారు. సోమవారం ఆయన తన జన్మదినం సందర్భంగా తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్, 2024ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వారు నల్లాని బాబును దుశ్శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నల్లానిబాబు మాట్లాడుతూ తిరుపతిలో ఎస్సీలకు ఉన్నతస్థానం కల్పించడంతో పాటు ఉన్నతస్థాయి పదవులు కల్పించిన గొప్ప మనసున్న వ్యక్తి భూమన కరుణాకరరెడ్డి అన్నారు, వారి కుటుంబానికి తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, నాయకులు కుమార్ ఉన్నారు.

వారపు సంతలో భోజనం



సంతలో ప్రజలకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో రైతులకు, వ్యాపారస్తులకు ప్రభుత్వవిప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉచితంగా భోజనాలను అందజేశారు. సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా భోజనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు, సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారస్తులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో భోజనం సరఫరా చేస్తున్నారని తెలిపారు. పాకాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనం సరఫరా చేస్తున్నారని వివరించారు. అన్ని సమయాల్లో తమకు అండగా ఉంటున్న చెవిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం తిరుపతి శాఖ న్యూ ఇయర్ క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ ఆవిష్కరించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అంబేడ్కర్ భవన్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.చెంగల్‌రాయలు, కోశాధికారి ఎం.ధనుంజయలు, ఉపాధ్యక్షుడు మైఖేల్ ఆర్టీసీ ఆర్‌ఎస్ తిరుమల, జి.ఏకాంబరం ఆర్టీసీ, సంఘం సభ్యులు సురేష్ నాయక్, భీమ్లా నాయక్, శ్రీనివాసులు, మోహన్, రఘు, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నందీశ్వరుని ప్రతిష్ట

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన భోగేశ్వరాలయంలో సోమ వారం నంది ప్రతిష్ట పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురాతన చరిత్ర కలిగిన ఇక్కడి భోగేశ్వరాల యం శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయాన్ని తెలు సుకున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన అరుణ్‌ఫణి అరుల్‌కట్టడై ట్రస్టు ఇక్కడి ఆలయంలో నంది విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగా ట్రస్టు ప్రతినిధులు శివశంకర్, శివనాయనర్, పచ్చయప్పన్ పూజల అనంతరం నంది విగ్రహాన్ని ప్రతిష్టించారు. వారు మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో దేశంలో 703 ఆలయాల నిర్మాణం చేపట్టినట్టు పేర్కొన్నారు. నంది విగ్రహం ప్రతిష్ట సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో రేకుల షెడ్‌ను నిర్మించారు.

ఆకర్షణీయంగా పూర్ణకుంభం సర్కిల్

- కమిషనర్ హరిత



పూర్ణకుంభం సర్కిల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరంలోకి ప్రవేశించే ప్రజలు, యాత్రికులకు స్వాగతం పలికే పూర్ణ కుంభం సర్కిల్ అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆమె తెలిపారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీనివాససేతు కింద ఏర్పాటు చేస్తున్న సుందరీకరణ పనులను సోమవారం కమిషనర్ హరిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. గతంలో ఇదే సర్కిల్లో పూర్ణకుంభం ప్రతిమ, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి విగ్రహం, తెలుగుతల్లి విగ్రహం ఉండేవన్నారు. శ్రీనివాస సేతు నిర్మాణంలో భాగంగా విగ్రహాలను మరో ప్రాంతంలో భద్రపరిచామన్నారు. శ్రీనివాససేతు నిర్మాణం పూర్తి చేసుకోవడంతో ఇదే సర్కిల్లో పూర్ణకుంభం ప్రతిమను, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, తెలుగుతల్లి విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఇదే కూడలిలో సఫాయి మిత్ర కార్మికుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేసి విగ్రహాలు ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని, అదేవిధంగా విగ్రహాల కూడళ్లలో సుందరీకరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంపుపై శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్‌ను కమిషనర్ హరిత ఆదేశించారు.





సప్తగిరులపై 'చలి'గింతలు

కలియుగ దైవం కొలువైన తిరుమలలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులు చిరుజల్లుల్లోనే తడుచుకుంటూ వెళ్లారు. అయితే ప్రకృతి అందాలను భక్తులను కనులవిందు చేశాయి. పొగమంచుకు తోడు వర్షం పడడంతో తిరుమల ఘాట్ రోడ్లలో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. - తిరుమల









కురిసెనే.. వాన

నగరంలో తెల్లవారుజామున నుంచి మోస్తరు వర్షం పడి, రోజంతా చిరుజల్లులు కురిశాయి. దీంతో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు వర్షంలో ఇబ్బందులు పడ్డారు. ఆ దృశ్యాలను సాక్షి క్లిక్ మనిపించింది. తిరుమలకు వెళ్లే భక్తులతో బస్టాండ్ ప్రాంగణం రద్దీగా కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్



దళితుల ఓట్లను తొలగించేందుకు కుట్ర

- చంద్రగిరిలో 11,438 ఓట్ల తొలగింపునకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయండి
- దొంగగా ఫారం–7 పెట్టిన వారిని శిక్షించాలని దళితుల ఆందోళన



తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

తిరుపతి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దళితులు అండగా ఉంటున్నారనే అక్కసుతో చంద్రగిరిలో 11,438 దళిత సామాజిక వర్గానికి చెందిన వారి ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని దళిత నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆరోపించారు. నియోజకవర్గం పరిధిలోనే 11,438 మంది దళితుల ఓట్లను తొలగించాలని దొంగ ఫారం–7లను పెట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ఎదుట పార్టీలకు అతీతంగా దళిత నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తిరుపతి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా దళిత నాయకులు దామినేటి కేశవులు, ప్రేమ్‌కుమార్, మల్లారపు వాసు మాట్లాడుతూ ప్రశాంతమైన చంద్రగిరిలో దొంగ దరఖాస్తులను పెట్టి దళితుల ఓట్లను తొలగించేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దొంగ ఫోన్ నంబర్లు, అడ్రస్‌లతో బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, అమెరికా, లండన్ నుంచి దరఖాస్తు చేస్తున్నారని, వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీకి మొదటి నుంచి అండగా ఉండడమే దళితులు చేసిన పాపమా? అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు దళితుల ఓట్లను తొలగించాలని దొంగ ఫారం–7 లను అప్‌లై చేసిన వారిని అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని దళిత సామాజిక వర్గానికి చెందిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగమ్మ గుడి పాలక మండలిపై ఆరోపణలు అవాస్తవం

- గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్



మాట్లాడుతున్న గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, సభ్యులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు ఉత్సవ విగ్రహాలు అంటూ ఓ పత్రికలో రెండు రోజుల క్రితం వచ్చిన వార్త అవాస్తమని, కేవలం అవి నిందారోపణలేనని ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్ స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక మండలి ఏర్పాటైనప్పటి నుంచి అమ్మవారి జాతరను రెండుసార్లు అత్యంత వైభవోపేతంగా నిర్వహించిన ఘనత తమ పాలక మండలికే దక్కిందన్నారు. అలాగే ఆలయంలో రూ.2 కోట్లు గోల్‌మాల్ అంటూ ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ అబాసుపాలు చేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలను 3 ఏళ్లకు ఒకసారి ఎండోమెంట్ అధికారులు ఆదాయ వ్యయాలను తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ తనిఖీలో తప్పులు ఉంటే బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం కూడా జరుగుతుందన్నారు. అంతేగానీ విచారణకు ఆదేశించారన్న మాట పూర్తిగా అబద్ధమన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆలయంలో రూ.2 కోట్లు గోల్‌మాల్ జరిగిందని, పాలక మండలిని ఉత్సవ విగ్రహాలంటూ అగౌరపరచడం దుర్మార్గమన్నారు. అసత్య ఆరోపణలతో నిందలు మోపే వారిని అమ్మవారే కఠినంగా శిక్షిస్తారన్నారు. మరోసారి ఇలా తమ గౌరవానికి భంగం కలిగించేలా ఇష్టమొచ్చినట్లు రాస్తే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఎవరికైనా ఏదైనా సమాచారం కావాలంటే ఆలయ కార్యనిర్వహణాధికారి, పాలక మండలి సంసిద్ధంగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆలయ పాలక మండలి సభ్యులు వెంకటేశ్వరరావు, ధనశేఖర్, భారతి, రమణమ్మ, కృష్ణవేణమ్మ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే జగనన్న పాలవెల్లువ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ

భాకరాపేట : సహకార డెయిరీ రంగాన్ని బలోపేతం చేసేందుకు జగనన్న పాలవెల్లువ ఎంతో దోహదపడుతుందని ఎర్రావారిపాళెం ఎంపీపీ రెడ్డెమ్మ అన్నారు. సోమవారం ఎంపీడీఓ అమరనాథ్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ మహిళా పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువతో మహిళలు ఆర్థిక పురోభివృద్ధి దిశగా పయనించాలని తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా ముందుకు వెళ్తోందన్నారు. మరోవైపు పాడి రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులురెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు చెంగల్‌రెడ్డి, ఏపీఎం ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.

రాయల్ ఫోర్స్ ఏర్పాటు



మాట్లాడుతున్న రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సభ్యులు

తిరుపతి కల్చరల్: బలిజ, కాపు, ఒంటరి, తెలగ సామాజిక వర్గాల సంక్షేమం కోసం రాయల్ పీపుల్స్ ఫ్రంట్‌కు అనుబంధంగా రాయల్ ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు రాయల్ పీపుల్ ఫ్రంట్ అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రాయల్ తెలిపారు. ఈమేరకు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తమ రాయల్ పీపుల్స్ ఫ్రంట్ బలిజ, కాపు, ఒంటరి, తెలగ సామాజిక వర్గ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో బలిజ, కాపు వర్గాల ఓట్ల కోసం ఆరాట పడడం తప్ప వారి అభ్యున్నతి పట్ల స్పందించిన ప్రభుత్వాలు లేవన్నారు. తమ సామాజిక వర్గంపై దాడులు చోటు చేసుకుంటున్నా స్పందన లేదన్నారు. సమావేశంలో రాయల్ పీలుల్స్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి చక్రపాణి, వేణు రాయల్, నాగరాజ రాయల్ పాల్గొన్నారు.